క్లుప్తంగా

ఫార్మా ప్రమాదంపై విచారణ జరపాలని వినతి



జాయింట్ కలెక్టర్ కల్పన కుమారికి వినతి పత్రం అందజేస్తున్న గనిశెట్టి

పరవాడ: ఫార్మాసిటీలో ఈ నెల 5న స్మైలెక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గనిశెట్టి సోమవారం అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించని కారణంగానే ఈ ప్రమాదం సంభవించి కార్మికుడు మృతి చెందాడని ఆరోపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రమాదాలకు కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం నుంచి లక్ష్మీపురం వరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భద్రతా నియమాలు కూడా పాటించాలని సూచించారు. గోతుల వద్ద పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈ కె.దిలీప్,డీఈ వరప్రసాద్,ఏఈ.ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పేరూరి చిన బాబు, అంగటి సూరిబాబు, కె.సంతోష్ పాల్గొన్నారు.

కల్యాణం .. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పరవాడ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. ధనుర్మాసం పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో మేలు కొలుపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇరు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, మండల ప్రచార ధర్మ కర్త వెన్నల అప్పలనాయుడు, కూండ్రపు అప్పలనాయుడు, కె.కృష్ణంనాయుడు, ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

25వ రోజు విశేష పూజలు



వెంకటాద్రిపై స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్



అప్పన్న ఆలయంలో కొలువుదీరిన గోదాదేవి

సింహాచలం: ధనుర్మాస పూజలను 25వ రోజు సోమవారం విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై స్వామికి సుప్రభాత సేవ అనంతరం విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణ చేశారు. గోదాదేవికి బేడామండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు పూజలు చేశారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి గోదాదేవి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- పెందుర్తి వెంకటాద్రిపై సోమవారం స్వామికి తిరుప్పావై సేవాకాలం, గోదాదేవికి, వేంకటేశ్వర స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



జోబుదాస్‌ను సత్కరిస్తున్న మండల క్రైస్తవ సంఘం ప్రతినిధులు

సబ్బవరం: పెందుర్తి నియోజకవర్గ క్రైస్తవ సోదరులకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తప్పక నెరవేరుస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి జోబుదాస్ అన్నారు. సబ్బవరం సాయినగర్ కాలనీలోని జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో సోమవారం మండలంలోని పాస్టర్స్ ఆత్మీయ సహవాస సమావేశంలో పాల్గొన్నారు. సంఘం ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై ఆయన స్పందిస్తూ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ క్రైస్తవుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తారని చెప్పారు. కమ్యూనిటీ హాల్, శ్మశానవాటిక విషయంలో ఎమ్మెల్యే స్పష్టతతో ఉన్నారని, అధికారులను ఆ దిశగా అప్రమత్తం చేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల పెద్దలు జోబుదాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో సబ్బవరం మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి పువ్వుల విజయ్‌కుమార్, బి. వరప్రసాద్,డేవిడ్ లివింగ్ స్టన్,జాన్,డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు స్వస్తి పలికే వరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి స్వస్తి పలికే వరకు తమ ఉద్యమాలు కొనసాగుతాయిని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే నిరాహారదీక్షలో 697వ రోజు, సోమవారం కోక్ ఓవెన్ డిపార్ట్‌మెంట్ కార్మికులు కూర్చొన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన శ్రీజయ అంధ్రశ్రీమహాదేవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.ఆయోధ్యరామ్, ఎన్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, యు.రామస్వామి, వి.శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహనకుమార్, డి.వి. రమణారెడ్డి, సీహెచ్.సన్యాసిరావు, కె.పరంధామయ్య, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక, ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టే ప్రయత్నం యాజమాన్యం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని హితవు పలికారు. ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక సెగ తగిలేలా ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జన యాత్రలో కార్మికులంతా కటుంబసభ్యులతో సహా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.బాబూరావు, తాండ్ర కనకరాజు, సుబ్బారావు, ఎల్లారావు, కె.ఆనంద్‌కుమార్, టి.వి.కె. రాజు, పల్లా పెంటారావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

24 గంటల దీక్ష విరమణ



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి, దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: ఉక్కు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నడుపూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో గాంధీపార్కు ఎదుట చేపట్టిన 24 గంటల నిరాహారదీక్ష సోమవారం ముగిసింది. దీక్షలో కూర్చున్న మంత్రి గోపి, జగదీష్, ప్రసాద్, పి. గోపీ, గోవింద్, రాంబాబు, అప్పలరాజు, శ్రీను, భానుకిరణ్ తదితరులకు మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయకుండా అడ్డుకునేందుకు ఎన్ని పోరాటాలైనా చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

16న బౌద్ధ మేళా



బౌద్ధ మేళా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అనకాపల్లిలోని బుద్ధుని కొండపై ఈ నెల 16న నిర్వహించనున్న బౌద్ధ మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా మహాబోధి సొసైటీ అధ్యక్షుడు గుణుపూడి బాబు మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం బౌద్ధ పతాకావిష్కరణ ఉంటుందని తెలిపారు. కొండ ప్రవేశ ద్వారం నుంచి పంచశీల శాంతి యాత్ర నిర్వహించనున్నామని చెప్పారు. మయన్మార్ బౌద్ధ బిక్షువు వెనరబుల్ ఆయుపాల మహాథేరో, శ్రీలంక దేశ తెలుగు బౌద్ధ బిక్షువు వెనరబుల్ బోధీహీన్ బంతేజీ హాజరై దమ్మ సందేశం వినిపిస్తారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, గొందేశి వెంకటరమణారెడ్డి, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎఫ్‌బీఎస్ ఎన్నికల ప్రచారం



భెల్ ప్రధాన గేటు వద్ద ప్రచారం చేస్తున్న ఇంటక్, సిటూ అభ్యర్థులు

అక్కిరెడ్డిపాలెం: భెల్‌లో ఈ నెల 11న జరగనున్న ఫ్యామిలీ బెనిఫిట్ సొసైటీ (ఎఫ్‌బీఎస్) ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ అభ్యర్థులు ఎస్.అప్పారావు, జి.దేముడు విజయాన్ని ఆకాంక్షిస్తూ సంస్థ ప్రధాన గేటు వద్ద ప్రచారాలు చేపట్టారు. ఇరు యూనియన్లకు చెందిన ఉరుకూటి బాబూరావు, జి.టి.పి.ప్రకాష్, విజయ్ కుమార్, వి.ఆనందరావు, ఎస్.జగన్నాధరావు, సీతంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగానంద నారసింహుడిగా అప్పన్న



యోగానంద నారసింహ అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి యోగానంద నారసింహ స్వామి అలంకరణలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని యోగానంద నారసింహుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠంపజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

'పరిహారం ఇప్పించండి'

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ప్లాంట్ నిర్మాణం కోసం ఎక్విజేషన్ చేసిన తన భూమికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామానికి చెందిన బొండా వెంకటరావు కోరారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో వినతి పత్రం అందజేశారు. నష్టపరిహారం కోసం నంస్థను ఆశ్రయించినా ఫలితం శూన్యమని పేర్కొనారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకటరావు వినతిపత్రంలో కోరారు.

ఆత్మీయ కలయిక.. అపూర్వ వేడుక



ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

మల్కాపురం: విశాఖపట్నం ప్రభుత్వ క్వీన్ మేరీ ఉన్నత పాఠశాలలో 70 ఏళ్ల కిందట ఇంటర్ చదువుకున్న మిత్రులు ఒక వేదికపై కలుసుకున్నారు. నాటి విశేషాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లరి, చదువులో పోటీ పడే అంశాలు, ప్రస్తుతం వారి వారి కుటుంబ విశేషాలపై మాట్లాడుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ హాల్ ఈ వేడుకకు వేదికైంది. సోమవారం కలుసుకున్న వీరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.1968లో 12వ తరగతి (ఇంటర్) వరకు చదువుకున్న నాటి మిత్రులు సుమారు 20 మంది వరకు కలుసుకున్నారు.వీరిలో చాలా మంది వైద్యులుగా,ప్రధానోపాధ్యాయులుగా, వివిధ ఉన్నత హోదాల్లో పని చేసిన వారు ఉన్నారు. ఏటా డిసెంబర్ లేదా జనవరి నెలలో కలుస్తామని వారు చెప్పారు.

కోక్‌ఓవెన్స్‌లో లేత్ మెషీన్ ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ మెకానికల్ ఏరియా రిపేర్ షాప్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన లేత్ మెషీన్ సోమవారం ప్రారంభమైంది. కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి పి.కె. మిశ్రా ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ మెషీన్ ద్వారా విభాగానికి అవసరమైన విడి భాగాల తయారీ సులభతరం అవుతుందన్నారు. దీనిని అధికారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెకానికల్ ఇన్‌చార్జి జీఎం బి.టి. నాయక్, జీఎంలు జి.బి. శ్రీనివాసరావు, వై.వి.ఆర్. శ్రీనివాస్, బి. కోటేశ్వరరావు, ఎస్.కె. రౌత్, కార్మిక నాయకులు కొమ్ము ప్రసాదరావు, టి. కనకరాజు, నర్సింగరావు, భాస్కరరావు, డీజీఎంలు మురళీకృష్ణ, ఆర్.ఎ. బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు వాయిదా వేయండి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు వాయిదా వేయాలని సింహాచలం దేవస్థానం ఈవోకు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సూచించారు. గత పాలకమండలి సమావేశంలో దేవస్థానంలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెట్టాలని చైర్మన్ అశోక్‌గజపతిరాజు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈమేరకు బస్సుల కొనుగోలు విషయంపై దేవస్థానం అధికారులు ట్రస్ట్‌బోర్డు సభ్యులకు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో బస్సు కోటి 85లక్షల ఉంటుందని, రెండు బస్సులు కొనుగోలు చేసే విషయంపై ప్రతిపాదనలు పంపించారు. దీనిపై ట్రస్ట్‌బోర్డు సభ్యుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ప్రస్తుతం దేవస్థానం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అనేక పనులు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మరికొంత కాలం వాయిదా వేయాలని దేవస్థానం ఈవో త్రినాథరావుకు సభ్యులు సూచించారు.

జగన్ ప్రజాసంకల్ప యాత్ర చరిత్ర సృష్టించింది

- కార్పొరేటర్ ముమ్మన దేముడు



కేక్ కట్ చేస్తున్న 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతిపక్షనేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్ప యాత్ర దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించిందని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్ర ముగిసి సోమవారంతో నాలుగేళ్లు పూర్తిచే సుకోవడంతో పాపయ్యరాజుపాలెంలోని ఆర్టీసీ లేఅవుట్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మన దేముడు కట్‌చేసి వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు ప్రజలకు పంచిపెట్టారు. 3648 కిలోమీటర్ల పాదయాత్ర చేసి నిత్యం ప్రజల్లోనే ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల ఇబ్బందులు ప్రత్యక్షంగా చూసి చలించిపోయారన్నారు. అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపె ట్టారన్నారు. మరో 30 ఏళ్లు జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అంగటి సూరిబాబు, పేరూరి చినబాబు, కంచిబోయిన సంతోష్, రాపర్తి మాధవరావు, భవాని, కె.వి.ఆర్.లక్ష్మి, సూర్యకుమారి, దొడ్డి పద్మ, ప్రసన్న, మాధవి, వరూధిని, గంట్ల నర్సింహమూర్తి, చిట్టిబోయిన అప్పలరాజు, సదాశివుని రవితేజ, చిట్టిబోయిన తులసి తదితరులు పాల్గొన్నారు.

పనుల కల్పనలో అలసత్వం వహిస్తే చర్యలు



తవ్వవానిపాలెంలో మామిడి మొక్కలకు రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలిస్తున్న పీడీ సందీప్

సబ్బవరం:ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ. సందీప్ అన్నారు. మండలంలోని అమృతపురంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన మామిడి మొక్కలకు రింగ్ ట్రెంచ్ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. మండలంలో 4,800 మంది వరకూ ఉపాధి కూలీలు పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఉదయం 7 గంటలకు ఉపాధి కూలీలంతా పనులకు హాజరు కావాలని సూచించారు.ఈ విషయంపై క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి పాఠశాలలో మొక్కలు పెంపకం చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పరమేష్,ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తున్న అశోక్‌కుమార్, ఎస్‌ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పండగ రద్దీ నేపథ్యంలో కూడళ్లతో పాటు వాణిజ్య కూడళ్లలో వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. 94వవార్డు పరిధి వేపగుంట నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు మైక్‌ల ద్వారా ట్రాఫిక్ రూల్స్‌ని వివరించే విధానానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రమేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మైకుల ద్వారా ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలను తెలియజేశారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వివరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేనిదే ప్రయాణించవద్దన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. అలాగే పాదచారులు రోడ్డు క్రాస్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నర్సులు సేవా భావంతో పనిచేయాలి

-పెథాలజిస్టు కర్రి అరుణ



వైద్యురాలు కర్రి అరుణను సత్కరిస్తున్న బెహరా చైతన్య

గోపాలపట్నం: నర్సులు సేవా భావం కలిగి ఉండాలని పెథాలజిస్టు డాక్టర్ కర్రి అరుణ అన్నారు. నరవ బెహరా నర్సింగ్ కళాశాలలో సోమవారం ఇండక్షన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యాధిగ్రస్తుడికి.. వైద్యునికి సహకారిగా వ్యవహరించే కీలకమైన ఉద్యోగం నర్సింగ్ అని అన్నారు. వైద్యుడి సలహా మేరకు వ్యాధిగ్రస్తుడికి సేవలు అందించాలని సూచించారు. బెహరా కళాశాలల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య మాట్లాడుతూ చదువుతో పాటు ఆస్పత్రిలో తగిన శిక్షణ పొందడం అవసరమన్నారు. ఈ సందర్భంగా వైద్యురాలు కర్రి అరుణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రియ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

- యువత వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి
- రామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామి గీతాసరానంద
- కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో యువజనోత్సవం



యువజనోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న స్వామి గీతాసరానంద

మురళీనగర్: విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని యువతకు రామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామి గీతాసరానంద సూచించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సోమవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం పట్ల భక్తి, అనురక్తి కలిగి ఉన్నప్పుడే మన దేశం మరింత శక్తిమంతంగా మారుతుందన్నారు. వివేకానందుడి బోధనలు విశ్వం ఉన్నంత కాలం అనుసరణీయాలని వివరించారు. నేటి యువత బాహుబలంతోపాటు బుద్ధి బలం, ఆత్మ బలం కలిగి ఉండాలన్నారు. త్యాగం, మానవ సేవ వంటి ఉత్తమ లక్షణాలను విద్యార్థులు అలవరుచుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించి పోటీల్లో విజేతలకు స్వామి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ జీఈ రాజు, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ జి.వి.లక్ష్మణరావు, పెట్రో కెమికల్స్ విభాగం హెడ్ సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, బి.రామాంజనేయులు, బి.హెచ్.ప్రదీప్‌కుమార్, డి.దామోదర్, ఎస్.పి.కుమారి పాల్గొన్నారు.

14న సింహగిరిపై గోదాదేవి అలంకరణ పోటీలు

సింహాచలం: ఈనెల 14న భోగి పండగరోజు సింహగిరిపై స్వధర్మవాహిని సంస్థ ఆధ్వర్యంలో 5నుంచి 12 ఏళ్లలోపు బాలికలకు గోదాదేవి అలంకరణ, వస్త్ర ధారణ పోటీలు నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ తెలిపారు. సింహగిరిపై ఉన్న రాజగోపురం పక్కన ఉన్న సాంస్కృతిక కళావేదికపై ఆరోజు ఉదయం 9 నుంచి 10గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐదుగురు విజేతలకు రూ.1000 చొప్పున నగదు బహుమతి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

సబ్బవరం:మండలంలోని చింతగట్ల అగ్రహారంలో నాగరాజు అనే వ్యక్తి నీరుపారే కొండ గోర్జ దిశమార్చి ఇంటి నిర్మాణం చేపట్టారని గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా కట్టడాన్ని నిలిపివేయాలని సూచించినా సదురు వ్యక్తి పట్టించుకోలేదని పేర్కొన్నారు. స్థల పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రమణ, సత్యం,వి అప్పారావు, ఆర్. సత్యం, బి. అచ్చెంనాయుడు తదితరులు ఉన్నారు.